నిధులొచ్చినా జాప్యమెందుకో !

డబుల్ బెడ్ రూం ఇళ్లకు విద్యుత్ సౌకర్యం కరువు

- నిధులు మంజూరై ఏడాది దాటినా పనులు చేపట్టని అధికారులు
- రెండేళ్లుగా లబ్ధిదారులకు తప్పని తిప్పలు

చిలుకూరు : అంగట్లో అన్ని ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందంగా మారింది డబుల్ బెడ్ రూం ఇళ్ల లబ్ధిదారుల పరిస్థితి. విద్యుత్ సౌకర్యం కోసం నిధులొచ్చి ఏడాది దాటినా డబుల్ బెడ్ రూం ఇళ్ల కాలనీకి మాత్రం కరెంట్ రావడం లేదు. గత ప్రభుత్వంలో మండలంలోని ఆర్లెగూడెంలో 20, పోలేనిగూడెంలో 40, నారాయణపురంలో 40, బేతవోలు గ్రామంలో 60 మొత్తం 160 డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించారు. అనేక ఏళ్ల నిరీక్షణ తర్వాత లబ్ధిదారులకు ఇళ్లు పంపిణీ చేశారు. లబ్ధిదారులు డబుల్ బెడ్ రూం ఇళ్లలోకి వెళ్లి దాదాపుగా రెండేళ్లు కావస్తోంది. కానీ నాటి నుంచి ఇళ్లకు కరెంట్ సౌకర్యం కల్పించడం లేదు. ఇళ్ల వద్ద తాగునీరు, డ్రైయినేజీ వ్యవస్థ, సీసీ రోడ్లు వంటి మౌలిక వసతులను ఒక్కొక్కటిగా కల్పించినా కరెంట్ సౌకర్యం కల్పించడంలో మాత్రం జాప్యం జరుగుతోంది. దీంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎండలకు పగటిపూట ఉక్కపోతతో ఇళ్లలో ఉండలేకపోతున్నామని, రాత్రివేళ విషపురుగులు ఇళ్లలోకి వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు తప్పని పరిస్థితుల్లోతాత్కాలికంగా స్తంభాల నుంచి సొంత ఖర్చుతో తీగలు లాక్కొని కరెంట్ సౌకర్యం ఏర్పాటు చేసుకున్నారు.

నిధులు మంజూరై ఏడాదైనా..

మండలంలోని డబుల్ బెడ్ ఇళ్ల వద్ద కరెంట్ సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం నుంచి నిధులు కూడా మంజూరయ్యాయి. నారాయణపురంలోని డబుల్ బెడ్ రూం ఇళ్లకు రూ.11.49 లక్షలు, ఆర్లెగూడెంలోని డబుల్ బెడ్ రూం ఇళ్లకు రూ.8. 33 లక్షలు, బేతవోలులోని ఇళ్లకు రూ.9.66 లక్షలు, పోలేనిగూడెంలోని ఇళ్లకు రూ.8. 9 లక్షల నిధులు మంజూరయ్యాయి. నిధులు మంజూరై ఏడాది పూర్తయింది. విద్యుత్ స్తంభాలు కూడా పాతారు. కానీ తీగలు లాగలేదు. ఇప్పటికైనా అధికారులు తక్షణమే స్పందించి డబుల్ బెడ్ రూం ఇళ్లకు కరెంట్ సౌకర్యం కల్పించి తమ ఇబ్బందులు తొలగించాలని పలువురు లబ్ధిదారులు కోరుతున్నారు.


బేతవోలులోని డబుల్ బెడ్ రూం ఇళ్లు


డబుల్ బెడ్ ఇళ్లకు లబ్ధిదారులు తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్న విద్యుత్ తీగలు

త్వరలో విద్యుత్ సౌకర్యం కల్పిస్తాం



చిలుకూరు మండలంలోని ఆర్లెగూడెం, నారాయణపురం, పోలేనిగూడెం, బేతవోలు గ్రామాల్లో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్ల వద్ద కేవలం కరెంట్ తప్ప మిగిలిన మౌలిక సదుపాయాలు కల్పించాం. కరెంట్ సౌకర్యానికి నిధులు మంజూరయ్యాయి. విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి త్వరలోనే కరెంట్ సౌకర్యం కల్పిస్తాం.

– సాయిరాం, పీఆర్ ఏఈ, చిలుకూరు

క్లుప్తంగా

షూటింగ్ పోటీలో ప్రథమ స్థానంలో బేతవోలు వాసి



నిర్వాహకుల చేతుల మీదుగా నగదు బహుమతి అందుకుంటున్న వెన్నెల

చిలుకూరు : కరీంనగర్‌లో స్వదేశ్ షూటింగ్ స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఇటీవల రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన షూటింగ్ పోటీలో చిలుకూరు మండలంలోని బేతవోలు గ్రామానికి చెందిన ఆర్టీసీ కండక్టర్ బెల్లంకొండ వీరయ్య కుమార్తె వెన్నెల మొదటి స్థానంలో నిలిచింది. నిర్వాహకుల చేతుల మీదుగా నగదు బహుమతి అందుకుంది. ఈ సందర్భంగా ఆమెను గ్రామస్తులు అభినందించారు.

సమభావన సంఘాల బలోపేతానికి కృషి


మాట్లాడుతున్న దుర్గాప్రసాద్

నడిగూడెం : మండలంలోని సమభావన సంఘాల బలోపేతానికి కృషిచేస్తానని గ్రామీణాభివృద్ధి సంస్థ ఏపీఎం రెమిడాల దుర్గాప్రసాద్ తెలిపారు. మంగళవారం స్థానికంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలో మొత్తం 580 సమభావన సంఘాలున్నాయని, 20 సంఘ బంధాలున్నట్లు తెలిపారు. కాగా, పాలకవీడు మండలంలో విధులు నిర్వహిస్తున్న ఈయన ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన కౌన్సిలింగ్‌లో సీనియారిటీ ప్రకారం నడిగూడెం మండలానికి బదిలీపై వచ్చారు. నడిగూడెం మండలంలో ఏపీఎంగా పని చేసిన రామలక్ష్మి పాలకవీడుకు బదిలీపై వెళ్లారు.

కల్లూరులో కంటివైద్య శిబిరం


కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

నేరేడుచర్ల : మండలంలోని కల్లూరు గ్రామంలో టీయూడబ్ల్యూజే, ఐజేయూ జాతీయ కార్యవర్గ సభ్యులు కొంజేటి సత్యనారాయణ, చలసాని శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో మంగళవారం సూర్యాపేట లయన్స్ క్లబ్ సహకారంతో ఉచిత కంటివైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 200 మందికి కంటివైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమున్న వారికి ఉచితంగా వైద్యం చేస్తామని వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారులు మధన్, స్వాతి, స్థానికులు కొడాలి పట్టయ్య, భాస్కర్, వెంకటేశ్వర్లు, మురళి, కొండయ్య, శ్రీను, వీరస్వామి, సాంబయ్య, శ్రీనివాస్, రంగయ్య, నాగరాజు, వెంకన్న, పిచ్చయ్య తదితరులు ఉన్నారు.

అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మించాలి

మునగాల : 65వ నంబర్ జాతీయ రహదారిపై మునగాల మండలంలోని మాధవరం శివారులో గల నేలమర్రి స్టేజీ వద్ద అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మించి నేలమర్రి రోడ్డును డబుల్‌రోడ్డుగా మార్చాలని గ్రామానికి చెందిన ఆర్జీయల్ ఫౌండేషన్ అధ్యక్షుడు, సామాజిక వేత్త రాంపంగు వెంకటేశ్వర్లు కోరారు. మంగళవారం మునగాలలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నేలమర్రి స్టేజీ వద్ద క్రాసింగ్ అత్యంత ప్రమాదకరంగా ఉందని, అండర్‌పాస్ బ్రిడ్జి లేకపోవడంతో ఈ ప్రాంతంలో రోడ్డు దాటుతూ సుమారు 20 మందికి పైగా ప్రమాదానికి గురై మృత్యువాత పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని గతంలో అనేకసార్లు జీఎమ్మార్ సంస్థకు విన్నవించినా ప్రయోజనం లేదని, ప్రస్తుతం 65వ నంబర్ జాతీయరహదారిని ఆరులైన్లుగా విస్తరిస్తున్నందున ఎన్‌హెచ్‌ఏఐ ఆధ్వర్యంలో నేలమర్రి స్టేజీ వద్ద అండర్‌పాస్ నిర్మాణం చేపట్టే విధంగా జిల్లా మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతి కృషిచేయాలని వెంకటేశ్వర్లు కోరారు.

పాపన్నగౌడ్ జయంతి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

హుజూర్‌నగర్ : హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో ఈనెల 10న జైగౌడ జాతీయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించబోయే సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ 375 వ జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని ఆ సంఘం నాయకులు కోరారు. మంగళవారం హుజూర్‌నగర్‌లోని శ్రీకంఠమహేశ్వరస్వామి ఆలయం వద్ద జయంతి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. అనంతరం సీఐ జి.చరమంద రాజుకు ఆహ్వాన పత్రిక అందజేశారు. కార్యక్రమంలో ఆసంఘం నాయకులు కె.నాగేశ్వరరావు, నరసింహ, పి.బాబు, ఎన్.శంకర్, వి.కృష్ణ, చిరంజీవి, రామన్న తదితరులు పాల్గొన్నారు.

భూ వివాదంలో వ్యక్తిపై దాడి

నడిగూడెం : భూ వివాదంలో ఒకరిపై దాడి చేసిన సంఘటన మంగళవారం మండల పరిధిలోని తెల్లబల్లిలో జరిగింది. ఎస్‌ఐ గందమళ్ల అజయ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం .. తెల్లబల్లి గ్రామానికి చెందిన వేముల ఏడుకొండలు 190 సర్వే నంబర్‌లో గల వ్యవసాయ భూమిని గత పదేళ్లుగా సాగు చేసుకుంటున్నాడు. అదే గ్రామానికి చెందిన చేకూరు ఆనందరావు, రాజ్యంలు.. ఏడుకొండలు వ్యవసాయ భూమిలోకి వెళ్లి పైపులైన్‌ను ధ్వంసం చేసి, ఏడుకొండలు తల్లి ఎర్రమ్మపై దాడి చేశారు. ఏడుకొండలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పోడు రైతుల నుంచి దరఖాస్తుల స్వీకరణ


పోడు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

మఠంపల్లి : కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి జనజాతీయ ఉన్నత గ్రామ అభియాన్ పథకం కింద పోడు భూములు కలిగిన రైతులకు అందిస్తున్న సబ్సిడీ రుణాలను సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ గుగులోతు శ్రావణి, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ గోవర్ధన్ అన్నారు. మంగళవారం మండలంలోని చెన్నాయిపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన గ్రామ సభలో వారు పాల్గొని మాట్లాడారు. పోడు భూములకు పట్టేదార్ హక్కులు కలిగిన రైతులకు సబ్సిడీ రుణాలుగా గొర్రెలు, మేకలు, పౌల్ట్రీలు, పందుల పెంపకానికి రుణాలు అందజేస్తున్నట్లు తెలిపారు. అనంతరం 26 మంది పోడు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో పశుగణన సహాయకులు రమాకాంత్, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, సేవాలాల్ నియోజకవర్గ అధ్యక్షుడు బానోతు తులసీరామ్‌నాయక్, గ్రామపెద్దలు మాలోతు శ్రీనివాస్‌నాయక్, మగథానాయక్, బజ్జునాయక్, లోకనాధంనాయక్, రవీందర్‌నాయక్, మాంగూనాయక్, రాజు, సక్రు, బిల్ కలెక్టర్ దావీదు, రైతులు పాల్గొన్నారు.

మెంటల్ ఎబిలిటి పుస్తకం ఆవిష్కరణ


మెంటల్ ఎబిలిటి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

చిలుకూరు : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భౌతిక శాస్త్రం ఉపాధ్యాయుడు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కందిబండ రామారావు నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షకు ప్రిపేర్ అయ్యే విద్యార్థుల కోసం రూపొందించిన మెంటల్ ఎబిలిటి పుస్తకాన్ని మంగళవారం పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు కరుణాకర్‌రెడ్డి తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి ఆవిష్కరించారు. రెండేళ్లు కష్టపడి విద్యార్థుల కోసం మెంటల్ ఎబిలిటి పుస్తకం రూపొందించినట్లు రామారావు తెలిపారు. ఈ పుస్తకం ఎన్‌ఎంఎంఎస్ విద్యార్థులకే కాకుండా బ్యాంకింగ్, రైల్వేస్, పోలీస్ రిక్రూట్‌మెంట్, గ్రూప్స్‌కు ప్రిపేర్ అయ్యే విద్యార్థులకు కూడా ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను తోటి ఉపాధ్యాయులు అభినందించారు.

సీపీఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

హుజూర్‌నగర్ : మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కుత్బుల్లాపూర్ మండలంలో ఈనెల 19వ తేదీ నుంచి 22 వరకు జరగబోయే సీపీఐ రాష్ట్ర నాలుగవ మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం హుజూర్‌నగర్‌లోని సీపీఐ కార్యాలయం అనుమాల లింగయ్య భవన్‌లో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు, జిల్లా కౌన్సిల్ సభ్యులు, మండల కార్యదర్శులు, ప్రజాసంఘాల జిల్లా స్థాయి అధ్యక్ష, కార్యదర్శుల నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బెజవాడ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. దేశంలో వంద సంవత్సరాలుగా ప్రజా సమస్యలపై పోరాటాలు నిర్వహిస్తున్న పార్టీ సీపీఐ అని అన్నారు. సమావేశంలో సీపీఐ నాయకులు యల్లావుల రాములు, ధనుంజయనాయుడు, గుండు వెంకటేశ్వర్లు, దేవరం మల్లీశ్వరి, వెంకటేశ్వర్లు, జానయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

దొడ్డా పద్మకు నివాళి

కోదాడ : మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కుత్బుల్లాపూర్‌లో ఈ నెల 19 నుండి 22 వరకు జరిగే సీపీఐ రాష్ట్ర నాలుగవ మహసభలకు నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పలువురు సీపీఐ నాయకులు కోరారు. మంగళవారం కోదాడ సీపీఐ కార్యాలయంలో పార్టీ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా ఇటీవల మృతి చెందిన మాజీ ఎమ్మెల్యే దొడ్డా నర్సయ్య సతీమణి, సీపీఐ నాయకురాలు దొడ్డా పద్మ సంతాప సభ నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మేకల శ్రీనివాసరావు, షేక్ లతీఫ్, బద్దం కృష్ణారెడ్డి, మండవ వెంకటేశ్వర్లు, బత్తినేని హనుమంతరావు, రాజు దడ్డా వెంకటయ్య, చేపూరి కొండలు తదితరులు పాల్గొన్నారు.


కోదాడ : దొడ్డా పద్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

బీసీ రిజర్వేషన్ బిల్లుపై చిత్తశుద్ధి నిరూపించుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న దూళిపాల ధనుంజయనాయుడు

గరిడేపల్లి : రాష్ట్ర శాసనసభలో ఆమోదం పొందిన బీసీలకు 42శాతం రిజర్వేషన్ల బిల్లును కేంద్రానికి పంపితే గత నాలుగు నెలలుగా కేంద్రం ప్రభుత్వం పెండింగ్ పెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లుపై కేంద్రం చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దూళిపాళ ధనుంజనాయుడు అన్నారు. మంగళవారం మండలంలోని గానుగబండ గ్రామంలో బీసీ హక్కుల సాధన సమితి నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని రాష్ట్ర వ్యాప్తంగా బీసీలు ఉద్యమిస్తుంటే ఉద్యమాన్ని తప్పుదోవ పట్టించేందుకు ఒక పక్క బీజేపీ ధర్నాలు చేయడం మరో పక్క బీఆర్‌ఎస్ అనుబంధ సంఘం తెలంగాణ జాగృతి నిరాహార దీక్షలు చేస్తుంటే సురభి నాటకాలు గుర్తుకొస్తున్నాయని ఆయన ఎద్దేవా చేశారు. దేశ వ్యాప్తంగా కులగణన జరిపి పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో 50శాతం సీట్లు బీసీలకు రిజర్వ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పోకల వెంకటేశ్వర్లు, ముశ్క జానయ్య, యల్లావుల రమేష్, లింగరాజు, రమణ తదితరులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తపై అవగాహన

నేరేడుచర్ల : మున్సిపాలిటీలో వంద రోజుల ప్రణాళిక కార్యక్రమం కొనసాగుతోంది. ఇందులో భాగంగా 9వ వార్డులో తడి, పొడి చెత్త వేరు చేయూ విధానంపై మంగళవారం ఆర్‌ఓ శ్రీనివాస్‌రావు ప్రజలకు అవగాహన కల్పించారు. కంపోస్ట్ ఎరువుల తయారీ గురించి వివరించారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటిస్తూ వార్డుల్లో పారిశుద్ధ్య సమస్యలు పరిష్కరిస్తున్నట్లు ఆయన తెలిపారు. మున్సిపల్ సిబ్బంది, ఆర్‌పీలు, మహిళా సంఘాల సభ్యులు ఉన్నారు.

వ్యవసాయ పైపులైన్ ధ్వంసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు

నడిగూడెం : వ్యవసాయ పైపులైన్ ధ్వంసం చేసిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. నడిగూడెం ఎస్‌ఐ గందమళ్ల అజయ్‌కుమార్ తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని సిరిపురం గ్రామంలో మొక్క ధనమ్మకు చెందిన వ్యవసాయ పైపులైన్‌ను అదే గ్రామానికి చెందిన కమతం లక్ష్మయ్య ధ్వంసం చేశాడు. పైపులైన్ ఉన్న భూమిని కూడా ఆక్రమించేందుకు యత్నించాడు. ధనమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

గరిడేపల్లి : ఆశా కార్యకర్తలకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు ఎస్‌కె యాకూబ్ కోరారు. మంగళవారం మండల కేంద్రంలో ఆశా వర్కర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ఆశా కార్యకర్తలకు కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అరుణ, భవాని, నాగమణి, నిర్మల, సుహాసిని, సైదమ్మ, వీరమ్మ, జానమ్మ, హేమలత, సుధా పాల్గొన్నారు.

కనకదుర్గమ్మ విగ్రహానికి జాలాభిషేకం


ఆలయం వద్ద జల బిందెలతో మహిళలు

మోతె : మండలంలోని కొత్తగూడెం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీకనకదుర్గమ్మ దేవాలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపనలో భాగంగా మంగళవారం అమ్మవారు, పోతరాజు విగ్రహాలకు మహిళలు జలాభిషేకం చేశారు. అంతకు ముందు ఆలయ ప్రాంగణంలో వేద పండితులు హోమం నిర్వహించారు. బుధవారం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సం నిర్వహించనున్నారు.

ఎమ్మార్పీఎస్ మండల నూతన కమిటీ ఎన్నిక


నియామకపత్రం అందుకుంటున్న కమిటీ సభ్యులు

మోతె : మండల కేంద్రంలో మంగళవారం ఎమ్మార్పీఎస్ జిల్లా ఇంచార్జి బచ్చకూరి వెంకటేశ్వర్లు మాదిగ, ఎంఎస్‌పీ జిల్లా ఇంచార్జి ఏపూరి రాజు మాదిగ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ మోతె మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బైరపంగు విజయ్‌కుమార్, అధికార ప్రతినిధిగా యాతాకుల ప్రభాకర్, ప్రధాన కార్యదర్శిగా గురిజాల వెంకన్న, ఉపాధ్యక్షులుగా దైద శ్రవణ్, ఇరుగు శ్రీకాంత్, గజ్జి శ్యాంసుందర్, సంద్ర లింగయ్య, నల్లాల శ్రీనివాస్, పడిశాల శంకర్, కార్యదర్శులుగా దున్నపోతుల వీరమల్లు, ఉబ్బపెల్లి రాంచందర్, ప్రచార కార్యదర్శులుగా కొండ ప్రకాష్, గంట లక్ష్మణ్, గౌరవ సలహాదారులుగా కంకణాల శ్రీనివాస్, దోసపాటి ఏసు, సహాయ కార్యదర్శిగా కిన్నెర రమేష్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు యాతాకుల యల్లయ్య, రామాంజి, సాయికృష్ణ, రాము పాల్గొన్నారు.

క్లినిక్ ఎదుట మృతుడి కుటుంబసభ్యుల ఆందోళన

మునగాల : ఆర్‌ఎంపీ చేసిన వైద్యం వికటించడంతోనే వ్యక్తి మృతిచెందాడని ఆరోపిస్తూ మృతుడి కుటుంబసభ్యులు మునగాల మండల కేంద్రంలోని ఆర్‌ఎంపీ క్లినిక్ ముందు మంగళవారం ఆందోళనకు దిగారు. వివరాలు.. బరాఖత్‌గూడెం గ్రామానికి చెందిన గోవింద వెంకటేశ్వర్లు(35) వృత్తి రీత్యా సన్నకారు రైతు. అతనికి గత రెండు రోజులుగా జ్వరం వస్తుండడంతో కుటుంబసభ్యులు మంగళవారం మండల కేంద్రంలోని ఓ ఆర్‌ఎంపీ వద్దకు తీసుకువచ్చారు. ఆర్‌ఎంపీ చికిత్స చేస్తుండగా వెంకటేశ్వర్లు ఒకేసారి అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో కుటుంబసభ్యులు హుటాహుటీన కోదాడలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందాడు. దీంతో వెంకటేశ్వర్లు కుటుంబసభ్యులు, గ్రామానికి చెందిన కొందరు మండల కేంద్రంలోని ఆర్‌ఎంపీ క్లినిక్ వద్దకు చేరుకొని మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలంటూ ఆందోళనకు దిగారు. దీంతో పోలీసులు రంగప్రవేశం చేసి ఆందోళన చేస్తున్నవారిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. తన అన్న మృతికి ఆర్‌ఎంపీనే కారణమని ఆరోపిస్తూ మృతుడి సోదరుడు వీరబాబు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

మట్టపల్లిలో నిత్యకల్యాణం

మఠంపల్లి : మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శ్రీరాజ్యలక్ష్మి, చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని మంగళవారం అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీసామి అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవ సంవాదం చేపట్టారు. కల్యాణ వేడుకలో భాగంగా విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రుత్విగ్వరణం, పంచగవ్య ప్రాసన, మధుఫర్కపూజ, మాంగల్యధారణ, తలంబ్రాలతో వైభవంగా జరిపారు. స్వామి అమ్మవార్లను గరుడ వాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లోఊరేగించారు. క్షేత్రపాలకుడైన శ్రీఆంజనేయస్వామికి తమలపాకులతో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు భక్తులు పాల్గొన్నారు.

గొర్రెలకు సకాలంలో వైద్యం అందలేదు

- జిల్లా పశువైద్యాధికారి శ్రీనివాసరావు


మృతిచెందిన గొర్రెకు పోస్టుమార్టం నిర్వహిస్తున్న డాక్టర్ శ్రీనివాసరావు

మునగాల : మండలంలోని విజయరాఘవపురం శివారులో సోమవారం విషపూరితమైన మొక్కలు తినడంతో అస్వస్థతకు గురైన గొర్రెల మందకు సకాలంలో వైద్యం అందకపోవడంతోనే మృతిచెందాయని జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ డి.శ్రీనివాసరావు తెలిపారు. మృతిచెందిన గొర్రెల మంద ప్రాంతానికి మంగళవారం ఆయన చేరుకొని మృతిచెందిన గొర్లలో రెండింటికి స్థానిక పశువైద్యాధికారుల ఆధ్వర్యంలో పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నారాయణపేట జిల్లా ధన్వాడ మండలం హనుమాన్‌పల్లి గ్రామానికి చెందిన కొర్ల శివకుమార్‌కు చెందిన గొర్లమందను వారం రోజుల క్రితం మేత కోసం మునగాలకు తీసుకువచ్చారని, మూడు రోజుల క్రితం గొర్రెల మంద విషపూరితమైన గ్రాసం (కొత్తగా మొలకెత్తిన గడ్డి)ని తిని అస్వస్థతకు గురవడంతో గొర్రెల కాపరులు నాటువైద్యం చేశారని తెలిపారు. ఈ క్రమంలో పరిస్థితి విషమించి గొర్రెలు మృతి చెందుతుండడంతో సోమవారం సాయంత్రం స్థానికంగా అందుబాటులో ఉన్న రేపాల పశువైద్యాధికారిణి మమతకు సమాచారం ఇచ్చారని, కానీ అస్వస్థతకు గురైన గొర్రెలు అప్పటికే మృత్యువాత పడినట్లు తెలిపారు. సకాలంలో వైద్యం అందిస్తే పలు గొర్రెలు బతికే అవకాశం ఉండేదని తెలిపారు. ప్రస్తుతం బతికి ఉన్న కొన్ని గొర్రెల రక్తం శాంపిల్స్ తీసుకొని ల్యాబ్‌కు పంపించామని, పశుసంవర్ధక శాఖ రాష్ట్ర, జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ల్యాబ్ పరీక్షల అనంతరం నివేదిక అందచేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మునగాల, రేపాల పశువైద్యశాల వైద్యులు డాక్టర్ ఇ.భాస్కర్, బి.మమత, స్థానిక ఎస్‌ఐ బి.ప్రవీణ్‌కుమార్, జిల్లా గొర్రెల పెంపకందారుల సంఘం ప్రధాన కార్యదర్శి ఉప్పుల రమేష్, మాజీ జిల్లా అధ్యక్షుడు వీరబోయిన వెంకన్న, గోపాలమిత్రలు, తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి



కోదాడలో ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులు, సీఐటీయూ నాయకులు

కోదాడ : మున్సిపాలిటీల్లో పని చేస్తున్న కార్మికులకు కనీస వేతనం రూ.26 ఇవ్వాలని, పని గంటల పెంపు జీఓ 282ను వెంటనే రద్దు చేయాలని తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నెమ్మాది వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మంగళవారం కోదాడ మున్సిపల్ పని చేస్తున్న కార్మికులు రాష్ట్ర మున్సిపల్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) లో చేరారు. ఈ సందర్భంగా కోదాడలో రంగా థియేటర్ సెంటర్ నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సుందరయ్య భవన్‌లో జరిగిన సమావేశంలో వెంకటేశ్వర్లు కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 142 మున్సిపాలిటీలు, 17 మున్సిపల్ కార్పోరేషన్‌ల్లో పని చేస్తున్న 64 వేల మంది మున్సిపల్ కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వకుండా వెట్టిచాకిరీ చేయిస్తున్నారని ఆరోపించారు. కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.రాంబాబు, జిల్లా కోశాధికారి కోటగిరి వెంకటనారాయణ, శ్రీలం శ్రీను, యాలక సామయ్య, రాములు, ముత్యాలు, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం 15 మందితో కూడిన నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొమ్ము నాగేశ్వరరావు, కార్యదర్శిగా గోపి, ఉపాధ్యక్షుడిగా లింగమ్మ, నాగమణి, దవనం, దేవిక, కమలమ్మ, బెనర్జీ, బ్రహ్మం, తదితరులను ఎన్నుకున్నారు.

వైభవంగా సామూహిక కుంకుమార్చన


కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

నేరేడుచర్ల : పట్టణంలోని శ్రీకోదండ రామాలయంలో శ్రావణమాసం సందర్భంగా మంగళవారం శ్రీలక్ష్మి అమ్మవారికి ఆలయ ప్రధాన అర్చకుడు బృందావనం తేజ ఆధ్వర్యంలో మహిళలు కుంకుమార్చనను వైభవంగా నిర్వహించారు. అదేవిధంగా ఆంజనేయస్వామికి, అమ్మవారి వెండి ప్రతిమకు అభిషేకం చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కొణతం సత్యనారాయణరెడ్డి, పులిజాల వెంకటరమణారావు, కృపాకర్, పూర్ణచంద్రారెడ్డి, యడవల్లి వెంకట్‌రెడ్డి, వెంకన్న, శేఖర్, సైదయ్య, విజయ్, దేవేందర్, లచ్చిరెడ్డి, నారాయణరెడ్డి, శ్రీరాంరెడ్డి, నర్సిరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, లక్ష్మారెడ్డి ఉన్నారు.

'సనా'లో ఘనంగా సిగ్నేచర్ డే


వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

కోదాడరూరల్ : పట్టణ పరిధిలోని సనా ఫార్మసీ కళాశాలలో మంగళవారం సిగ్నేచర్ డేను విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు తెలుపురంగు టీషర్టులు ధరించి వాటిపై సంతకాలు, అభిప్రాయాలు రాసుకుంటూ ఆనందంగా గడిపారు. అనంతరం కళాశాల డైరెక్టర్ నౌమాన్ మాట్లాడుతూ.. ఫార్మసీ పూర్తి చేసిన విద్యార్థులు ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గోపిరెడ్డి, హెచ్‌ఓడీ నరేంద్ర నాయుడు, హాఫీజ్‌అక్తర్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

డబ్బాపాలు వద్దు, తల్లిపాలు ముద్దు

మోతె : డబ్బాపాలు వద్దు, తల్లి పాలు ముద్దని మోతె ఎంపీడీఓ టి.ఆంజనేయులు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం-2 లో జరిగిన తల్లిపాల వారోత్సవాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. తల్లి ప్రసవించిన గంట సమయంలోనే ముర్రుపాలు పట్టిస్తే బిడ్డకు మొదట వ్యాధి నిరోధక టీకాగా పని చేస్తుందన్నారు. తల్లి పాలు బిడ్డకు ఆరు నెలల వరకు సరిపోతాయని, ఆ తర్వాత అనుబంధ పోషక పదార్థాలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి, అంగన్‌వాడీ టీచర్, పిల్లల తల్లులు పాల్గొన్నారు.

బిడ్డకు ఆరు నెలలు తల్లిపాలు ఇవ్వాలి

హుజూర్‌నగర్ : పుట్టిన ప్రతి బిడ్డకు ఆరు నెలల వరకు తల్లిపాలు ఇవ్వాలని అంగన్‌వాడీ టీచర్ రంగమ్మ అన్నారు. మంగవారం హుజూర్‌నగర్‌లోని 1వ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. కార్యక్రమంలో చిన్నారులు, తల్లులు పాల్గొన్నారు.


హుజూర్‌నగర్ : చిన్నారికి అన్నప్రాసన చేస్తున్న అంగన్‌వాడీ టీచర్

క్షేత్రపాలకుడికి పంచామృతాభిషేకం

హుజూర్‌నగర్ : మండలంలోని బూరుగడ్డ గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీఆదివరాహ లక్ష్మీనరసింహ వేణుగోపాలస్వామి దివ్య క్షేత్రంలో క్షేత్రపాలకుడు శ్రీఆంజనేయస్వామికి మంగళవారం పంచామృతాభిషేకం, 108 తమలపాకులచే ఆకుపూజ చేశారు. ఈ సందర్భంగా స్వామికి గంధ సింధూరం, పానకం, వడపప్పు, పండ్లు, నారికేళము, పులిహోర, వడమాల, ప్రసాద నివేదన గావించారు. అనంతరం పూజారులు స్వామివారికి పూల దండలతో అలంకరణ చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు గింజల నరేందర్‌రెడ్డి, వాసంతి, ఆలయ కమిటీ చైర్మన్, ధర్మకర్తలు, ఈఓ, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.


పూజలో పాల్గొన్న ఆలయ చైర్మన్, ధర్మకర్తలు, ఈఓ, భక్తులు